క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి ఇత్తడి తొడుగు బహూకరణ



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురంలో నూతనంగా పునఃప్రతిష్ఠించిన శ్రీ వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (కోటి పడగల పుణ్యక్షేత్రం)కి రేపల్లెకు చెందిన మానేపల్లి వెంకట శివనాగేశ్వరరావు, అనూరాధ దంపతుల కూతురు, అల్లుడు పొన్నూరు హరిహరన్-రమ్యశ్రీ దంపతులు రూ. 55 వేలు వ్యయం చేసే ఇత్తడి తొడుగును మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి వారికి, జంట నాగులకు క్షీరాభిషేకం నిర్వహించారు. వేద బ్రాహ్మణులు ఫణిశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. అమ్మ అమృతమయి బాలస్వామి దేవస్థాన పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతి దాతలను ఆశీర్వదించి అభినందించారు.

రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు విద్యార్థి ఎంపిక



కర్లపాలెం: రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు 10వ తరగతి విద్యార్థి ఎస్.ధర్మేంద్ర పోతురాజు రెడ్డి ఎంపికై నట్లు కర్లపాలెం హై వెండ్ హై స్కూల్ హెచ్ఎం డి.ఏసోబు తెలిపారు. విద్యార్థి అభినందన సభ మంగళవారం హైస్కూల్‌లో నిర్వహించారు. హెచ్ఎం ఏసోబు మాట్లాడుతూ.. జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 31న చింతాయపాలెం హై స్కూల్‌లో జరిగిన అండర్ -19 విభాగం పోటీల్లో ధర్మేంద్ర ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. కర్నూలులో ఈ నెల 18వ తేదీ నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని హెచ్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ ఆర్.గోపిచంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి మతిస్థిమితం లేని వృద్ధురాలు



కర్లపాలెం: మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలిని కర్లపాలెం పోలీసులు మంగళవారం పొన్నూరులోని గోతాలస్వామి వృద్ధాశ్రమానికి తరలించారు. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వృద్ధురాలు నాలుగు రోజులుగా కదల్లేని స్థితిలో కర్లపాలెం పెట్రోల్ బంక్ వద్ద ఉంటోందని స్థానికుల సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. తమ సిబ్బందితో ఆమె వద్దకు వెళ్లి పరిశీలించగా మతిస్థిమితం లేదని గుర్తించినట్లు చెప్పారు. తన పేరు, ఊరు చెప్పలేకపోతుండడంతో.. వృద్ధాశ్రమానికి తరలిస్తున్నామని తెలిపారు. ఆమెని గుర్తించిన వారు బంధువులకు లేదా 94409 00870 నంబరుకు సమాచారమివ్వాలన్నారు.

నేడు మండల పరిషత్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఈ-క్రాప్‌లో పంట నమోదు తప్పనిసరి

వేమూరు: రబీలో సాగు చేసే పంటలను రైతులు ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ చందోలు సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగు చేస్తున్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం జెరాక్స్ స్థానిక రైతు భరోసా కేంద్రంలో అందజేయాలని పేర్కొన్నారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

కొల్లూరు : కోడి పందెం నిర్వహిస్తున్న స్థావరాలపై పోలీసులు దాడులు చేసి, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఈపూరు పరిసర ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో.. కొల్లూరు పోలీసులు దాడులు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్న మూడు స్థావరాలపై దాడులు జరిపి ఆరు కోడి పుంజులతోపాటు..కోడి కత్తులు, రూ.3,020 నగదు స్వాధీనం చేసుకున్నారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకొన్నారు. సంక్రాంతి సందర్భంగా ఈపూరు పరిసర ప్రాంతాల్లో కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించి 13 కేసులు నమోదు చేసి, 52 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమ ప్రదాతకు పట్టం కట్టండి

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



బేతపూడి గ్రామంలో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ.. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రతి ఒక్కరిని పలుకరిస్తూ.. వారి సమస్యలను ఎమ్మెల్యే కోన అడిగి తెలుసుకున్నారు. నాయకుల ప్రమేయం, సిఫార్సులు లేకుండానే అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. బేతపూడి తన సొంత గ్రామమని, ఈ ప్రాంతాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, సర్పంచ్ ఎ.కుమారి, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం ద్వారా చెరువుల అభివృద్ధి



అబ్బన గూడవల్లి గ్రామంలో చెరువును పరిశీలించిన డీఎల్పీఓ

అబ్బనగూడవల్లి(వేమూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల కట్టలు అభివృద్ధి చేయడం జరుగుతుందని రేపల్లె డివిజనల్ అభివృద్ధి అధికారి బాలమ్మ తెలిపారు. అబ్బన గూడవల్లి గ్రామంలో అమృత సరోవర్ ద్వారా అభివృద్ధి చేసిన చెరువు కట్టను ఆమె పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేమూరు మండలం జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల్లో నియోజకవర్గంలో వెనుకబడి ఉందని తెలిపారు. నిర్మాణంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణం వేగవంతం చేయాలని ఆమె సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేయడంలో చాలా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. జనవరిలో కూడా 30 శాతం మాత్రమే వసూలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

మైనార్టీల సమస్యలపై 21న సదస్సు

రేపల్లె: జై భీమ్ భారత్ పార్టీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాలులో ముస్లిం, మైనార్టీల సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు జై భీమ్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి దోవా రమేష్ రాంజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారానికి నిర్వహించే సదస్సులో ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

'పుష్పక' ఆటో



పరిమితికి మించి ఆటోలో ప్రయాణం

పిట్టలవానిపాలెం: అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా.. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా.. పుష్పక విమానం మాదిరి.. 'పుష్పక' ఆటో డ్రైవర్ల తీరు మారడం లేదు. సీట్లు నిండుకున్నా.. వెనుక డిక్కీలో..డ్రైవర్ పక్కనో కూసింత ఖాళీ ఉన్నా.. ప్రయాణికులను ఇరికించేస్తున్నారు. కూలికెళ్లే.. నిరక్షరాస్యులైనా.. బీటెక్‌లు చేసే అక్షర జ్ఞానులైనా.. ఆటోలో ఇలాంటి ప్రయాణం తప్పట్లేదు. ముఖ్యంగా పండుగ వేళల్లో..ఇలాంటి చిత్రాలు పల్లె ప్రాంతాల్లో సర్వసాధారణంగా కనిపిస్తూనే ఉంటాయి. మండలంలోని ఖాజీపాలెంలో గాలిదూరడానికి కూడా సందులేకుండా ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఇది. మిత వేగంతో వెళ్లినా.. డ్రైవర్ చేయి తిరగని విధంగా అటు..ఇటూ ప్రయాణికులనప్పుడు.. ప్రమాదం అనేది తెలిసి తెచ్చుకున్నదేకానీ.. ప్రమాదవశాత్తు కాదనేది ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు గుర్తుంచుకోవాలి.

నగదు విత్‌డ్రాపై కేసు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తికి తెలియకుండా.. అతని బ్యాంకు ఖాతా నుంచి నగదు డ్రాచేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. శ్రీరామ్‌నగర్‌కు చెందిన దిల్ బహదూర్ సోమవారం చుట్టుగుంట సమీపంలోని చికెన్‌షాపునకు వెళ్లాడు. చికెన్ కొనుగోలు చేసే క్రమంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఇంటికి వచ్చిన కొంతసేపటికి అతని కుమారుడు హరిబహదూర్ సెల్‌కు.. దిల్ బహదూర్ బ్యాంక్ ఖాతాలోని రూ.30వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్‌లో ఉండటం చూసి ఖంగుతిన్నాడు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పౌరాణిక కళాకారుడు వెంకయ్యకు సన్మానం



వెంకయ్యను సన్మానిస్తున్న సుభాని


తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం చండశాసనుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం ఉమ్మడి కుటుంబం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థల కళాకారుడు మోదుకూరు వెంకయ్యను సన్మానించారు. కార్యక్రమంలో షేక్ సుభాని, పఠాన్ కరిముల్లా, షేక్ అజీమ్‌తుల్లా, షేక్ షబ్బీర్, ఆలపాటి కరుణ, మోదుకూరు శారమ్మ, పెమ్మసాని పోతురాజు, హేమంత్‌కుమార్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అటవీశాఖ ప్రధాన కార్యాలయం ప్రారంభం

మంగళగిరి: నగర పరిధిలోని ఆటోనగర్‌లో పీవీఎస్ ల్యాండ్‌మార్క్ భవన్‌లో అటవీశాఖ ప్రధాన కార్యాలయం ప్రారంభం కానుంది. గురువారం రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు అటవీశాఖ ప్రధాన ముఖ్యసంరక్షణ అధికారి వై.మధుసూదనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

గుల్లబారేది ఇందుకండి!

పద్దెనిమిదేళ్ల రాము సైకిల్ తొక్కుతూ కిందపడ్డాడు. పైకి గాయాలేవి లేకపోవడంతో ఊపిరి పీల్చుకుని, లేచి సర్దుకుని ఇంటికి బయల్దేరాడు. ఎడమ కాలు కాస్త నొప్పిగా ఉంటున్నా.. అంతే మొండిగా ఉండసాగాడు. ఇక మూడు రోజులకు కాలంతా బరువుగా, అడుగు తీసి అడుగువెయ్యలేని పరిస్థితి ఏర్పడింది. వైద్యులను సంప్రదించడంతో ఆస్టియోపోరోసిస్ వ్యాధి కారణంగా గుల్లబారి కాలి ఎముక విరిగిందని చెప్పడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. శరీరానికి తగినంత ఎండ తగలకపోవడం, వ్యాయామం లేకపోవడం, పోషకాహారం లోపంతో ఇటువంటి పరిస్థితి తలెత్తుతుందని వైద్యులు తెలిపారు.



- చిన్నదెబ్బలకే విరిగిపోతున్న ఎముకలు
- విటమిన్ 'డి' లోపమే ప్రధాన కారణం
- యువతలో పెరుగుతున్న ఆస్టియోపోరోసిస్

గుంటూరు మెడికల్: చిన్న చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోవటం ఆస్టియోపోరోసిస్ వ్యాధి (బోలు ఎముకల వ్యాధి) సోకినవారిలో కనిపించే ప్రధాన లక్షణం. మనిషికి వయస్సుమీద పడే కొలది అనేక రకాల వ్యాధులు సోకి బాధిస్తాయి. అలాంటి వాటిల్లో ఆస్టియోపోరోసిస్ ఒకటి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు యువతలో కూడా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తూ ఉండటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో చాలా మంది ఎండ ఏ మాత్రం తగలకుండా ఏసీ గదుల్లో ఉండి పోతున్నారు. ఆటలు ఆడేందుకు కూడా ఎండలోకి ఏ మాత్రం రాకుండా గదుల్లోనే ఉండి పోతూ ఉండటంతో పాఠశాల విద్యార్థులకు ఏదైనా దెబ్బతగిలిన సమయంలో ఊరికినే ఎముకలు విరిపోతున్నాయి. సాధారణంగా ఆడవాళ్లలో మోనోపాజ్ దశ దాటిన తరువాత 40 ఏళ్లలో, మగవాళ్లలో 50 ఏళ్ల వయస్సులో ఈ వ్యాధి వస్తోంది.

వ్యాధి లక్షణాలు...

వయస్సు పైబడిన వారిలో నడుంనొప్పి, వెన్నుముక ఎడుగుదల లోపించి ఎత్తు ఆగిపోవటం, ఒళ్లంతా నొప్పులు, ఏ పని చేయలేకపోవటం, నీరసం, నిస్సత్తువ, నిరాశ, ఓపిక లేకపోవటం తదితర లక్షణాలు ప్రాథమిక దశలో కనిపిస్తాయి. ఎండనుంచి శరీరానికి లభించే డీ విటమిన్ లభించకపోవటం కూడా వ్యాధి సోకటానికి ఒక కారణం. వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాలి. అశ్రద్ధ చేసే వెన్నుపూస, చేతిమణికట్టు, తుంటి వద్ద ఏ మాత్రం చిన్నదెబ్బతగిలినా చివరకు ఇంటి గడప కాలికి తగిలినా ఎముకలు విరిగిపోతాయి.

వ్యాధి సోకటానికి కారణాలు...



కుటుంబంలో ఎవరికైనా ఒకరికి వ్యాధి ఉంటే వారసత్వంగా ఇతరులకు వచ్చే అవకాశం ఉంది. సరైన పోషకాహారం తీసుకోకపోవటం, మద్యపానం, ధూమపానం లాంటి చెడు అలవాట్లు, థైరాయిడ్, లివర్ వ్యాధుల వల్ల, కొన్ని రకాల మందులు వాడటం ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. రోజంతా ఏమాత్రం ఎండలో రాకుండా ఏసీలోనే గంటలతరబడి గడపటంవల్ల ఈ వ్యాధి వస్తుంది. శారీరక వ్యాయామం ఏ మాత్రం చేయనివారికి, ముఖ్యంగా ప్రతిరోజూ కనీసం అరగంటకూడా నడవకపోవటం వల్ల ఇది సోకుంది. రక్తపరీక్షల ద్వారా, ఎక్సరే ద్వారా, ఎముకల సాంద్రత పరీక్షల ద్వారా వ్యాధి సోకిందా లేదా అనే విషయాలు తెలుస్తాయి.

బాధితులు అధికమే...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 150 మంది ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతి వైద్యుడి వద్దకు ప్రతి రోజూ 40 మందికి పైగా వివిధ రకాల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో సగం బాధితులు ఆస్టియోపోరోసిస్ బాధితులే. కీళ్లవాతం, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి ఆస్టియోపోరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది కాబట్టి వీరికి ముందస్తుగా పరీక్షలు చేయించాలి.

నివారణ చర్యలు...



వ్యాధికి చికిత్సలో భాగంగా శరీరంలో క్యాల్షియం లెవల్స్ పెంచాలి. పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవటం ద్వారా క్యాల్షియం పెంచుకోవచ్చు. విటమిన్ డి కోసం ప్రతిరోజూ కొంత సేపు ఎండలో ఉండాలి. కింద పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వయస్సు మళ్లిన వారికి విటమిన్ డి, క్యాల్షియం మాత్రలు ఇవ్వాలి. రోగులను ఖాళీగా ఉంచకుండా వారికి ఏదోఒకపని వ్యాపకం కల్పించాలి. పోషకాహారాన్ని అందించాలి. పొగ తాగటం, మద్యం సేవించటం లాంటి చెడు అలవాట్లు విడనాడాలి. ప్రతిరోజూ తప్పనిసరిగా అరగంటసేపైనా నడవాలి.

– డాక్టర్ జె.నరేష్‌బాబు, సీనియర్ స్పయిన్ సర్జన్, గుంటూరు

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



పూజా కార్యక్రమంలో భక్తులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో 40వ మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడ పిల్లలకు శీఘ్రంగా వివాహం జరిగేందుకు ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మహా గౌరీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్



విన్నర్ టీమ్‌కు షీల్డ్ అందజేస్తున్న రాజీవ్, ఎంపీపీ

నగరం: క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం పెంపొందుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్ పేర్కొన్నారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా మంగళవారం బహుమతి ప్రధానోత్సవ సభలో రాజీవ్ పాల్గొని, మాట్లాడారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్‌లు దోహద పడతాయన్నారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో 43 జట్లు పాల్గొనగా చెరుకుపల్లి ఈవూరు గణేష్ టీమ్ ప్రథమ, ఈదుపల్లి టీమ్ ద్వితీయ, ఇంటూరు టీమ్ తృతీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు ప్రోత్సాహక నగదు, షీల్డ్‌లను ఆయా జట్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల పవన్‌కుమార్, చందోలు దేవదాసు, వైఎస్సార్ సీపీ నాయకులు పురం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు..



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి



విజేతలకు బహుమతులు అందిస్తున్న కోటేశ్వరరావు తదితరులు

నిజాంపట్నం: మహిళల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ముగ్గుల పోటీలు దోహద పడుతాయని జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా అడవుల దీవి పంచాయతీ వీరంకివారిపాలెం గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి సాధించిన యామిని అనే మహిళకు రూ.3,116ల నగదును భాగ్యలక్ష్మి అందించారు. ద్వితీయ బహుమతిని మాణిక్యంకు రూ.2,116లు ఎంపీటీసీ రాజేష్‌కన్నా, తృతీయ బహుమతి అనూషాకు రూ.1,516ను యార్లగడ్డ వెంకట రాంబాబు అందజేశారు. పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులుగా చీరలు, పసుపు కుంకుమలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యార్లగడ్డ మదన్ మోహన్, వీరంకి రమణ, వీరంకి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ వీరంకి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

చెరుకుపల్లి: మండలంలోని ఆరుంబాక పంచాయతీ కామినేనివారి పాలెంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు చిన్నారులకు మంగళవారం ముగ్గులు, పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరక్టర్, ఆరుంబాక సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, పీటా నాగరాజు, అమర్తలూరి నాగరాజు, క్రాప రవికుమార్, పీటా శ్రీనివాసరావు, పేరం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ వేముల కుటుంబానికి న్యాయం చేయని కేంద్రం



రోహిత్ వేములకు నివాళులర్పించి, నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల కుటుంబానికి న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ ఆరోపించారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం రోహిత్ వేముల వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎన్నో ఆశలతో యూనివర్సిటీలోకి అడుగుపెట్టిన రోహిత్ అక్కడ వేధింపులకు వ్యతిరేకంగా పోరాడిన ఫలితంగా హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అవమానాలకు గురైనప్పటికీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో దీక్షకు దిగి, చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. రోహిత్ ఆత్మహత్య తర్వాత అనేక మంది ఎంపీలు పార్లమెంటులో గళం ఎత్తి ఏడేళ్లు గడిచినా వారి కుటుంబానికి న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల మధ్య మత ఘర్షణలు పెంచే విధంగా పని చేస్తోందన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, సాయి, అమరనాథ్, లీలా, వెంకట్‌సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేటివ్ యూనివర్సిటీ -2022గా 'ఏపీ ఎస్ఆర్ఎం'

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి ఇన్నోవేటివ్ యూనివర్సిటీ ఆఫ్ ది ఇయర్ - 2022గా గుర్తింపు లభించింది. బెంగళూరు కేంద్రంగా ప్రచురితమవుతున్న అకడమిక్ ఇన్‌సైట్స్ మేగజైన్ యాజమాన్యం దీన్ని ప్రకటించింది. ఉన్నత విద్యారంగంలో సాధించిన ప్రగతి, నూతన ఆవిష్కరణలకు గుర్తింపుగా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల కేటగిరీలో ఏపీ ఎస్ఆర్ఎంను ఎంపిక చేసినట్లు మేగజైన్ తెలిపింది. ఏటా విశ్వవిద్యాలయాల పనితీరును విశ్లేషించి ఉత్తమ యూనివర్సిటీలకు ఈ మేగజైన్ వివిధ కేటగిరీల్లో ప్రత్యేక గుర్తింపునిస్తుందని, ఇందులో భాగంగా 2022 విద్యాసంవత్సరానికి గానూ ఉత్తమ సృజనాత్మక విశ్వవిద్యాలయంగా ఏపీ ఎస్ఆర్ఎం ఎంపికైనట్లు కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియర్ పేర్కొన్నారు.

భారత్ పోస్ట్‌పేపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్ : ఉండవల్లికి చెందిన ఓ యువకుడు భారత్ పోస్ట్‌పేపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. బాధితుడు బొంతు గంగాధర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల రోజుల క్రితం భారత్ పోస్ట్‌పేలో వ్యాపార నిమిత్తం 50 వేల రూపాయల నగదును గంగాధర్ అప్పుగా తీసుకున్నారు. అందులో రూ.30 వేలు ఈఎంఐ రూపంలో నెలకు రూ.5 వేలు చెల్లిస్తున్నారు. మిగిలిన రూ.20 వేలకు సంబంధించి ఈ నెల 13వ తేదీ నగదు చెల్లించాల్సి ఉంది. పండుగ రావడంతో చెల్లించలేకపోయాడు. ఈ నేపథ్యంలో 17న సాయంత్రం భారత్ పోస్ట్‌పే నుంచి ఫోన్ చేస్తున్నామని ఓ వ్యక్తి గంగాధర్‌తో మాట్లాడాడు. డబ్బులు చెల్లించడం ఆలస్యం కావడంపై దుర్భాషలాడాడు. డబ్బులు చెల్లిస్తానని చెప్పినా వినకుండా మాటలతో మానసికంగా వేధించాడని బొంతు గంగాధర్ పేర్కొన్నారు.